## రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం

**● కారులోని ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో క్షేమంగా బయటపడిన భర్త**


కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన కారు


కల్యాణి (ఫైల్)


చివ్వెంల, మే 15: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందిన ఘటన మండలంలోని ఐలాపురం గ్రామంలో జాతీయ రహదారి 365బీబీపై గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి బృగుమళ్ల హరీశ్, ఆయన భార్య కల్యాణి (32) కలిసి కారులో కల్యాణి తల్లిగారి ఊరైన ఖమ్మం బయలుదేరారు. చివ్వెంల మండలంలోని ఐలాపురం గ్రామం వద్దకు రాగానే జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచిన కంటైనర్ లారీని వెనుక నుంచి కారు అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కల్యాణి తల, ఛాతి తదితర చోట్ల బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో హరీశ్ ప్రమాదం నుంచి ఎటువంటి గాయాలు కాకుండా క్షేమంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కల్యాణి మృతదేహాన్ని సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు.

## పార్కింగ్ చేసిన కార్లలో పిల్లలు ఎక్కకుండా చూడాలి : ఎస్పీ

సూర్యాపేట టౌన్, మే 15: వేసవి కాలంలో పార్కింగ్ చేసిన వాహనాల్లోకి అనుకోకుండా వెళ్లిన పిల్లలు తీవ్రమైన వేడితో ఊపిరాడక మరణిస్తున్న ఘటనలు ఇటీవల చాలా ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయని, ఇలాంటివి జరుగకుండా ప్రజలు తమ పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కె.నరసింహ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాగ్రత్తలు పాటిస్తే చిన్నారుల ప్రాణాలను రక్షించగలమని తెలిపారు. వాహనాన్ని లాక్ చేసే ముందు అందులో ఎవరైనా ఉన్నారా లేరా అని పరిశీలించాలని సూచించారు. వాహన తాళాలను పిల్లలకు అందుబాటులో ఉంచొద్దని, అనుకోకుండా వాహనంలోకి వెళ్లి చిక్కుకుపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వాహనాల విండోలకు బ్లాక్ ఫిల్ములు, అధిక టింటింగ్ ఉపయోగించరాదని, వాహనాల్లో ఎవరైనా ఉంటే గుర్తించలేమని అన్నారు. వాహనం వాడకంలో లేకపోయినప్పటికీ డోర్లు, విండోలను పూర్తిగా లాక్ చేయాలని, పిల్లలు కనిపించకుండా పోతే వాహనాల్లో చూడాలని సూచించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగమైతున్న రైతులు

**● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య**


మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య

తుంగతుర్తి, మే 15: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో రైతులు ఆగమవుతున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాడికొండ సీతయ్య అన్నారు. కాంగ్రెస్ 18 నెలల కాలంలో తీసుకున్న ప్రతి నిర్ణయం రైతుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగతుర్తిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా రాకపోవడం, సకాలంలో రుణమాఫీ కాకపోవడం, పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి అన్నదాతలు ఆవేదన చెందుతున్నా పట్టించుకునే నాథుడే కనపడడం లేదని పేర్కొన్నారు. మరో పది రోజుల్లో వానకాలం పంట సీజన్ రాబోతున్నా కొనుగోలు కేంద్రాల్లో పోసిన యాసంగి ధాన్యం ఇంత వరకు సగానికి పైగా కూడా కాంటాలు కాలేదని అన్నారు. కేంద్రాల్లో బస్తాలు సరిపడా లేకపోవడం, సమయానికి లారీలు రాకపోవడంతో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపగాని శ్రీను, బొంకూరి మధు తదితరులు పాల్గొన్నారు.

## సౌదీ అరేబియాలో కోదాడ వాసి అనుమానాస్పద మృతి


తాజుద్దీన్ (ఫైల్)

కోదాడ టౌన్, మే 15: కోదాడ పట్టణానికి చెందిన షేక్ తాజుద్దీన్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. తాజుద్దీన్ జీవనోపాధి కోసం పదేండ్ల క్రితం సౌదీ అరేబియాలోని దమామ్ పట్టణానికి వెళ్లి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి పేరు మీద లైసెన్స్ తీసుకొని తానే సొంతంగా కూరగాయల దుకాణం పెట్టుకొని నడిపిస్తున్నాడు. కాగా, బుధవారం సాయంత్రం తాజుద్దీన్ చనిపోయినట్లుగా అతడి స్నేహితులు ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు తెలిపారు. అయితే, కపిల్ అనే వ్యక్తి తాజుద్దీన్‌ను వేధింపులకు గురిచేస్తున్నాడని, అతడే హత్య చేసినట్లుగా కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో మృతదేహాన్ని కోదాడకు తీసుకొచ్చేందుకు ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు స్పందించి 9182053234 నంబర్‌ను సంప్రదించి ఆర్థిక సాయం చేయాల్సిందిగా వేడుకుంటున్నారు.

## 'ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం'


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, రైతులు

అర్వపల్లి, మే 15: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలని జాజిరెడ్డిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై గురువారం రైతులకు అవగాహన కల్పించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ జూనియర్ మేనేజర్ వి.శశికుమార్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటకు కూలీ ఖర్చులు తక్కువని, కోతుల బెడద ఉండదని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రభుత్వం కేటాయించిన కంపెనీ వారే విక్రయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ క్షేత్ర సహాయకుడు రంగు ముత్యంరాజు, రైతులు రామిడి వెంకటరెడ్డి, కుంట్ల సోమిరెడ్డి, ఎన్నమాళ్ల వెంకటయ్య, ఉదయ్, నర్సింహారావు, కోటేశ్, లింగయ్య, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రాపురం తండాలో కార్డెన్ సెర్చ్


సీజ్ చేసిన వాహనాలు

మఠంపల్లి, మే 15: మండలంలోని రామచంద్రాపురం తండాలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 46 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక కారు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి డీఎస్పీ మాట్లాడారు. ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేస్తూ కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. పిల్లల ఎదుగుదలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిని సన్మార్గంలో నడిపించాలని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గొడవలు, నేరాలు, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రులు, పిల్లలు సమాజంలో మంచి జీవనం సాగించాలని సూచించారు. సైబర్ మోసాలపై 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, కోదాడ రూరల్ సీఐ, హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, 100 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

**● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**


ఎర్రపహాడ్‌లోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

నూతనకల్, మే 15: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఎర్రపహాడ్, దిర్శనపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంటాలు త్వరితగతిన పూర్తి చేసి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్‌రావు, మండల వ్యవసాయ అధికారి మురళీబాబు, ఏపీఎం రమణాకర్ తదితరులు ఉన్నారు.

### మద్దిరాల మండలంలో పర్యటన

మద్దిరాల: మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ధాన్యం నాణ్యతను, రికార్డులను పరిశీలించారు. వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం మండలంలోని చిననెమిల గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా తవ్వుతున్న చేప పిల్లల పెంపకం చెరువును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనులు జరిగే చోట తాగునీరు, టెంట్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారా అని ఆరాదీశారు. అదేవిధంగా నర్సరీని సందర్శించి వర్షకాలం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. తాసిల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏపీఓ వెంకన్న, అధికారులు పాల్గొన్నారు.

## మిల్లర్లు ఎప్పటికప్పుడు ధాన్యం దిగుమతి చేసుకోవాలి

**● అదనపు కలెక్టర్ రాంబాబు**


జగన్మాత రైస్ మిల్లు యాజమాన్యంతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

చివ్వెంల, మే 15: కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని మిల్లర్లు ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. మండల పరిధి వల్లభాపురం, దురాజ్‌పల్లి గ్రామాల్లోని జగన్మాత, నవరత్న రైస్ మిల్లులను గురువారం అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మిల్లుల్లో ధాన్యం దిగుమతి ఆలస్యం కావడంతో లారీలు లేక కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా హమాలీలను ఎక్కువ మందిని ఏర్పాటు చేసుకొని కొనుగోలు కేంద్రాలకు లారీలను త్వరగా పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

**● డీఆర్‌డీఓ అప్పారావు**


నర్సరీని సందర్శించి మాట్లాడుతున్న డీఆర్‌డీఓ అప్పారావు

తుంగతుర్తి, మే 15: వేసవి కాలంలో నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరందించాలని డీఆర్‌డీఓ అప్పారావు సూచించారు. మండల కేంద్రం తుంగతుర్తిలోని నర్సరీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాటాడుతూ మొలకలు రాని బ్యాగుల్లో మళ్లీ గింజలు నాటాలని, ఎదుగుతున్న మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరు పోయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుకుమార్, ఏపీఓ కృష్ణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

**● ఎంఈఓ చత్రునాయక్**


కల్మలచెర్వులో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ చత్రునాయక్, ఉపాధ్యాయులు

గరిడేపల్లి, మే 15: పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాధికారి పానుగోతు చత్రునాయక్ కోరారు. మండలంలోని కల్మలచెర్వు గ్రామంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సైదులు, ఉపాధ్యాయులు రవి, శ్రీను, నాగయ్య, పీడీ సైదిరెడ్డి, పుష్పలత, విజయలక్ష్మి, రేణుక, సీఆర్పీ అశోక్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

**● గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్**


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కిరణ్

గరిడేపల్లి, మే 15: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకంపై గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం మృత్తిక శాస్త్రవేత్త అరిగెల కిరణ్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని రేగులగడ్డ తండాలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త కిరణ్ మాట్లాడుతూ రైతులు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకొని, దానికి అనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. మట్టి నమూనా సేకరించే విధానం, పచ్చిరొట్ట ఎరువులు, పశువుల ఎరువుల వాడకం, ఉపయోగాలను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది బచ్చు వెంకటేశ్వర్లు, రైతులు బి.శ్రీనివాస్, డి.నారాయణ, లింగయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ రక్షణ గోడ పరిశీలన


రక్షణ గోడను పరిశీలిస్తున్న అధికారులు

మఠంపల్లి, మే 15: మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ రక్షణ గోడను హుజూర్‌నగర్ నీటిపారుదల శాఖ ఎగిక్యూటివ్ ఇంజినీర్ డి.రామ్‌కిశోర్, అసిస్టెంట్ ఇంజినీర్ కె.జీవన్ గురువారం పరిశీలించారు. పులిచింతల బ్యాక్ వాటర్ నుంచి రక్షణ కోసం నిర్మించిన గోడ సీపేజ్ లీకేజీని ప్రత్యక్షంగా పరిశీలించి మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు అధికారులు తెలిపారు. లీకేజీ కారణంగా ఆలయంలోకి నీరు రావడం, ఆలయం ప్రమాదంలో ఉండడంతో పాటు భక్తులు భయభ్రాంతులకు గురవుతున్నారని, శాశ్వత పరిష్కారం చూపాలని ఆలయ కమిటీ సభ్యులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ సిరికొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి ట్రాలీ ఆటో బోల్తా

**● 8 మందికి గాయాలు**

చిలుకూరు, మే 15: అదుపుతప్పి ట్రాలీ ఆటో బోల్తాపడిన ఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన పలువురు కొంతకాలంగా కోదాడలో ఉంటున్నారు. చిత్తు కాగితాలు ఏరుకునేందుకు గురువారం కోదాడ నుంచి హుజూర్‌నగర్‌కు ట్రాలీ ఆటోలో వెళ్తుండగా చిలుకూరు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ప్రియాంక, నాగరాజు, వెంకటరమణ, పూజిత, జంపన్న, శివ, సత్యంతో పాటు మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కోదాడ వైద్యశాలకు తరలించారు. కాగా, ఆటో బోల్తాపడి సమీపంలో ఉన్న గేదెను ఢీకొట్టడంతో గేదెకు గాయాలయ్యాయి. బాధిత రైతు చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## 'దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి'

నూతనకల్, మే 15: కార్మిక, కర్షక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రూ.2.50 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వేణు, నర్సయ్య, అవిలయ్య, నాగలింగం, రాజయ్య, సూరయ్య, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

చిలుకూరు, మే 15: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాలెఅన్నారం గ్రామానికి చెందిన దేశబోయిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి బైక్‌పై హుజూర్‌నగర్ వైపు నుంచి వస్తూ మండల పరిధిలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో తమ గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంకటేశ్వర్లును స్థానికులు చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 'పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి'

సూర్యాపేట టౌన్, మే 15: ఎన్నికల ముందు గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచి కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ ఆదర్శ గ్రామ పంచాయతీ అండ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.దాసు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రతిభ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన ఆ యూనియన్ జిల్లా స్థాయి జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో 50 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి కనీస భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గం హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను సవరణ చేసిందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, దాసరి శ్రీను, లక్ష్మణ్, బండారు సైదులు, బొప్పాని రాంబాబు, మండల వీరన్న, భూక్యా మధుకర్, కోడి ఉప్పలయ్య, నవిల ఈదయ్య, సైదులు, సేవార్త, పూలమ్మ, పిచ్చమ్మ పాల్గొన్నారు.

## హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి


వేపలసింగారం గ్రామ శివారులో కాలిపోయిన హరితహారం మొక్కలు

హుజూర్‌నగర్ రూరల్, మే 15: హరితహారం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వేపలసింగారం గ్రామ శివారులో నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి అయ్యాయి. గురువారం కొంత మంది రైతులు పొలాల్లోని వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు రోడ్డు పక్కనే ఉన్న హరితహారం మొక్కలకు అంటుకొని కొన్ని పూర్తిగా కాలిపోయాయి. ఎండకాలంలో రోడ్ల వెంట నీడను ఇవ్వడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుతున్న చెట్లను కాపాడాలని పలువురు పర్యావరణ ప్రేమికులు అధికారులను కోరుతున్నారు.

## రైతు వేదిక సామగ్రి దొంగిలించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**● పోలీస్ స్టేషన్‌లో మండల వ్యవసాయాధికారి ఫిర్యాదు**

నేరేడుచర్ల, మే 15: మండల పరిధిలోని జానల్‌దిన్నె రైతు వేదికలో సామగ్రిని దొంగిలించిన దుండగులను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల వ్యవసాయాధికారి జావిద్ గురువారం నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రెండు రోజుల క్రితం రైతు వేదికను సందర్శించినప్పుడు పెద్ద టేబుల్, అల్మారా ఉన్నాయని, నేడు అవి కనిపించడం లేదని తెలిపారు. గతంలో కూడా రైతు వేదిక తలుపులు పగులగొట్టి ఫ్యాన్లు, మోటార్, ట్యూబ్‌లైట్లు, కుర్చీలు, కరెంట్ మీటర్ వైర్, ఫైల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని, స్విచ్‌బోర్డులు కూడా ధ్వంసం చేశారని వివరించారు. గతంలో అనేక సార్లు రిపేర్ చేయించినప్పటికీ ఫలితం లేదని, ఈ మేరకు ఉన్నతాధికారులకు సమాచారం అందించామని, వారి సూచనల మేరకు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

## ఓవరాల్ చాంపియన్‌గా గడ్డిపల్లి ఉద్యాన కళాశాల విద్యార్థులు


క్రీడా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

గరిడేపల్లి, మే 15: వనపర్తి జిల్లా మోజెర్ల గ్రామంలోని ఉద్యాన కళాశాలలో ఈ నెల 13,14 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గడ్డిపల్లి ఉద్యాన కళాశాల విద్యార్థులు పాల్గొని ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారని కళాశాల సెక్రటరీ ఎం.స్నేహలత తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం ఆమె అభినందించి మాట్లాడారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్ , టెన్నీకాయిట్, రన్నింగ్, అథ్లెటిక్స్, క్యారమ్స్, చెస్ పోటీల్లో గడ్డిపల్లి ఉద్యాన కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు బహుమతులతో పాటు ఉత్తమ ప్రదర్శన కనబరిచినందుకు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో కేవీకే ఇన్‌చార్జి, శాస్త్రవేత్త సీహెచ్.నరేశ్, డి.ఆదర్శ్. ఎ.కిరణ్, టి.మాధురి, ఎన్.సుగంధి పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

మేళ్లచెర్వు, మే 15: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000-01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. అప్పటి గురువులు సలీంషరీఫ్, వెంకటనారాయణ, ఏడుకొండలు, చిన్నప్ప, వెంకటరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పల్లేటి నాగార్జున, గణేశ్, నాగేశ్వర్‌రావు, వీరబాబు, సైదులు, రాధిక, పద్మ , లక్ష్మీభవాని. పుష్పలత, హైమావతి పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

**● మండల వైద్యాధికారి వేణుగోపాల్**


కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

హుజూర్‌నగర్, మే 15: ఎండలు మండుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి వేణుగోపాల్ సూచించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణంలోని ఓ రైస్ మిల్లు కార్మికులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ బారినపడకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ తీవ్రతను నివారించడంలో ఓఆర్ఎస్ సహాయపడుతుందని పేర్కొన్నారు. అనంతరం కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పద్మ, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, లలిత, ఆశ కార్యకర్తలు సుశీల, జ్యోతి, హేమలత పాల్గొన్నారు.

## విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి : ఏఓ

మునగాల, మే 15: విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ బుంగరాజు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో రాత్రికి రాత్రి వచ్చి విక్రయించే నకిలీ విత్తనాలను ఎట్టి పరిస్థితిలో కొనుగోలు చేయొద్దని, ముఖ్యంగా బీజీ-3 పేరుతో చలామణి అవుతున్న పత్తి విత్తనాలను కొనుగోలు చేయరాదని సూచించారు. విత్తనాల రశీదుపై డీలర్ లైసెన్స్ నంబర్, విత్తనాల రకం, లాట్ నంబర్, విత్తనాల తయారీ, గడువు తేదీలు, రైతు సంతకం, డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. పంట వేసిన తర్వాత విత్తన సంచులను, బిల్లులను పారవేయకుండా జాగ్రత్తంగా ఉంచుకోవాలని, విత్తనాలలో ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు నష్టపరిహారం పొందడానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

**ప్రకటన**

To
**అందరి సభ్యులకు, పబ్లిక్ క్లబ్, కోదాడ**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, సెక్రటరీ, పబ్లిక్ క్లబ్, కోదాడ (రిజిస్ట్రేషన్ నెం.207/1968) కలిగి ఉన్నటువంటి వారు వారి యొక్క అభ్యర్థన లేఖ నంబరు : 15298681620250504, తేది:04-05-2025 ద్వారా సొసైటీస్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, మున్సిపల్ కాంప్లెక్స్, రామగిరి, నల్లగొండ-508001 గారికి తేది:06-05-2025న అందజేసినటువంటి దరఖాస్తు ద్వారా ఈ క్రింద తెలిపిన విషయమును నమోదు కొరకు కోరియున్నారు.

ఎ). 1968 నుండి 2025 వరకు మేనేజింగ్ కమిటి/ఎగ్జిక్యూటివ్ కమిటి యొక్క వార్షిక జాబితా రికార్డ్ చేయడం.
బి). పబ్లిక్ క్లబ్, కోదాడ యొక్క చిరునామా మార్పు రికార్డ్ చేయడానికి
సి). పబ్లిక్ క్లబ్, కోదాడ యొక్క బై-చట్టాలలో మార్పులు రికార్డ్ చేయడానికి

అందువల్ల పబ్లిక్ క్లబ్, కోదాడలోని ఏ సభ్యుడు అయిన. పైన పేర్కొన్న వాటికి వ్యతిరేకంగా అనగా ఎ) నుండి సి) అంశములకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్న యెడల, వారు తమ అభ్యంతరాలను సొసైటీస్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, మున్సిపల్ కాంప్లెక్స్, రామగిరి నల్లగొండ-508001 గారి ముందు ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 15 రోజుల లోపు దాఖలు చేయవలసి ఉంటుంది.

*సొసైటీస్ రిజిస్ట్రార్, నల్లగొండ-508001 గారి ఆధేశముల మేరకు*

SD/- **సెక్రటరీ**
పబ్లిక్ క్లబ్ కోదాడ, సూర్యాపేట జిల్లా
తెలంగాణ (రిజిస్టర్డు నం.207/1968)

స్థలం: కోదాడ
తేది :15-05-2025